బోనస్‌తో రైతులకు ప్రోత్సాహం



బిజినేపల్లి మండలం మంగనూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: రైతులను పండించిన పంటకు ప్రభుత్వం బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మంగనూర్‌లో ఐకేపీ కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజ్‌గౌడు, పరశురాములు, వెంకటస్వామి, అమృత్‌రెడ్డి, తిరుపతయ్య, కత్తె ఈశ్వర్, నసీర్, మధుసూదన్‌రెడ్డి, పాష, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

తిమ్మాజిపేట: రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బుద్దసముద్రం, ఆవంచ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. అనంతరం బుద్దసముద్రంలో పాఠశాలను సందర్శించారు. గ్రామంలో సీసీ రోడ్డు, అండర్ డ్రెయినేజీ, హైమాస్ట్ లైట్లు మంజూరు చేయాలని కోరారు. నేలకొరిగిన మొక్కజొన్న పంటను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో వింటో ఉపాధ్యక్షుడు రాందేవ్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌బహదూర్, మల్లయ్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాదవ్, రవూఫ్, నాగసాయిలు, కోపయ్య, రాజు, మహిళలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

లింగాల: పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించుటకు ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత, లింగాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. సన్న రకం వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటగిరి, వ్యవసాయాధికారి అనిల్, సీఈఓ పాండు, మార్కెట్ డైరెక్టర్ ముక్తార్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు శంకర్‌నాయక్, రాజు, నర్సింహ, తిర్పతిరెడ్డి, అల్లె శ్రీనివాసులు, నాయకులు రాజునాయక్, మల్లేష్, ఎల్లేష్, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

చారకొండ: మండల కేంద్రంలో జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులు న్యాయం చేయాలంటూ సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీలు నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితులు ప్రజావాణిలో తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్ శ్రీనివాసులు, మధు, చారకొండ కార్యదర్శి బాలస్వామి, బాధితులు విజయ, జెల్ల అలివేల, కిరణ్, రాములమ్మ, అనసూయ, వెంకటమ్మ, జగదీశ్వర్, బాలమ్మ, సుమతమ్మ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ఉపాధి హామీ కూలీలకు 4 నెలలు పెండింగ్ బిల్లు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యకాస ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మ్లాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 20 రోజులుగా సమస్యలపై సర్వే నిర్వహించామన్నారు. ఉపాధి కూలీలకు సక్రమంగా కూలి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సుబాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు, సురేష్, ఉపాధి కూలీలు బంగారమ్మ, అలివేల, పార్వతమ్మ, బాలమణి, రాములమ్మ, రాములు బాలయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుడి కుటుంబానికి చేయూత



కల్వకుర్తి రూరల్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్తీక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ 82 నాయకులు పరామర్శించి రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దశరథం, కార్యదర్శి శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్, పరశురాం, వరం జ్యోతి, శేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని తురకలపల్లి గ్రామానికి చెందిన శివమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సోమవారం గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, శేఖర్ గౌడ్, నాగరాజు, భీమయ్య, బీరయ్య, కేశవులు, సైదులు, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెద్దకొత్తపల్లి: అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని బీఎంఎస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 15 ఏళ్ల నుంచి కనీస వేతనాల సవరణ చేపట్టలేదన్నారు. ఐదేళ్లకు ఒకసారి వేతనాల సవరణ చేయాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మలిశెట్టి చంద్రశేఖర్, ప్రభాకర్, శివుడు, పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



కందనూలు: జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీలోగల ప్రాథమిక పాఠశాలలో ఆయుష్ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం డాక్టర్ శభాష్ మాలిక్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. తాజా ఆకుకూరలు, పండ్లు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఫార్మసిస్ట్ మురళిగౌడ్, అంజలి, రవికుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మన్ననూర్: అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ మోటమారి మధు పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో మన్ననూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీఓ మాధవిలు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

వంటపాత్రల పంపిణీ



తాడూరు: పీఎంపోషణ్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన వంటపాత్రలను మండలంలోని ఆయా గ్రామ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణకు సోమవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, అనిల్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

తాడూరు: మండంలోని పాపగల్‌లో ఆదివారం సాయంత్ర కురిసిన భారీ వర్షాలకు మురుగుకాల్వలు చెత్తచెదారంతో నిండిపోయాయి. సోమవారం ఉదయం అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి వీరయ్య వీధులను పరిశీలించారు. పైపులైన్‌కు లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతు చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పోచమ్మగడ్డతండాలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జీహెచ్‌ఎం ఆర్. రవీందర్ పేర్కొన్నారు. సోమవారం ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయన మండలంలోని దుబ్బతండా, పోచమ్మగడ్డతండా, రావిచెట్టుబావి తండా, ఉబ్బలగట్టు తండా, మల్లయ్యగుండుతండాల్లో ఇంటింట బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అందిస్తున్న వసతుల గురించి వివరించారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫామ్ అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. అనంతరం ఆయా తరగతుల్లో 10 మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికిరణ్, కమలేకర్, నాగేశ్వర్ రావు, రేణుక, జ్యోత్స్న, చంద్రశేఖర్, పత్య, సాజిదా బేగం, దానయ్య, జాన, మమత ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన వారికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. సోమవారం గ్రామానికి చెందిన లింగమయ్యకు రూ.22వేలు, సువర్ణకు రూ.19వేలు, రవికి రూ.15వేలు, పుష్పమ్మకు రూ.8వేల రూపాయల చెక్కులను మాజీ సర్పంచ్ గోలి కమలమ్మ అందజేశారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, సంజీవ్ యాదవ్, భూపతిరెడ్డి, రమకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం



చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో హైమాస్ట్ లైట్లు సోమవారం ఎస్ఐ శంషోద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్‌రాం గౌడ్, నాయకులు వెంకటయ్య గౌడ్, తిరుమల్లేష్ నాయక్, రవీందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, మణిపాల్ రెడ్డి, లాలు నాయక్, నునూ రాజు, విష్ణు తదితరులు ఉన్నారు.

రేషన్‌కార్డుదారులకు బియ్యం ఇవ్వాలి



పెంట్లవెల్లి: నూతన రేషన్‌కార్డుదారులకు రేషన్‌బియ్యం ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ జయసింహకు వినతిపత్రం అందజేశారు. రేషన్ కార్డులో పేరు ఉన్న డీలర్లు బియ్యం ఇవ్వడం లేదని వివరించారు. కార్యక్రమంలో హనుమంతు, శ్రీనివాసులు, తిమ్మస్వామి, శ్రీను, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ఫిర్యాదు



మన్ననూర్: సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని కోరుతూ సోమవారం పదర ఎస్ఐకి ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఖాజా, ఉపాధ్యక్షుడు భద్రీనాథ్, హరికృష్ణ, రాజు, నరేష్, మజీద్ తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ల విడుదల



నాగర్‌కర్నూల్ రూరల్: అమరవీరుల స్ఫూర్తితో మేడేను నిర్వహించుకుందామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవనంలో ఆ సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటస్వామి, శ్రీనివాసులు, సత్యం, పద్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మైనర్ బాలిక అదృశ్యంమైన ఘటనలో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం వనపట్ల గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈ నెల 20న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకి తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మామిడి తోటల రైతులను ఆదుకోవాలి

కొల్లాపూర్ రూరల్: మామిడి తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని నార్లాపూర్ శివారులో ఇటీవల కురిసిన వర్షాలు, వడగాలులకు నేలరాలిన మామిడి తోటలను సీపీఎం బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి రైతులతో నష్టం గురించి చర్చించారు. కొల్లాపూర్ ప్రాంతంలో మామిడి మార్కెట్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, సలీం తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పాన్‌గల్: విశ్వావసు నామ సంవత్సర శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని సోమవారం మండలంలోని అన్నారంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల వారు రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత, 100 రకాల గ్రంథాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, సభ్యులు సురేష్‌కుమార్, బద్రీనాథ్, కృష్ణయ్య, బాలమ్మ, స్వరూప, నాగరత్నం, లలిత, సౌమ్య నిశాంత్, సాత్విక్, శశికుమార్, స్నేహ, శివమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

కందనూలు: జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషిచేస్తానని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జర్నలిస్టులు స్థానిక సమస్యలతోపాటు, పలు అంశాలను ప్రెస్ అకాడమీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేసేదిలేదని, పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలాగే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు అంశంపై ప్రభుత్వంతో చర్చించగా సానుకూలంగా స్పందించిందని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు విజయ్‌కుమార్, సాయిలుసాగర్, యాదగిరి, మాధవరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

బల్మూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తునట్లు ఏఎంఓ నరేష్ కుమార్, ఆర్ఐ పద్మలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.


లింగాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పాండునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్యక్తిగత సమాచారం చెప్పొద్దు



కోడేరు: అపరిచితులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దని జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కొత్తగా పరిచయం అయిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్ అమ్మాయిలు లైంగికంగా వేధింపులకు గురైతే భరోసా కేంద్రం అండగా ఉంటుందన్నారు. మైనర్ బాలికలను వేధిస్తే పోక్సో చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కవిత, షీటీమ్ మెంబర్ వెంకటయ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళ మృతి



కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో లావుడ్య లక్ష్మి (75) లంబాడి వృద్ధ మహిళ సోమవారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో రేకుల గుడిసెలో ఉంటూ జీవిస్తోంది. సమయానికి తిండిలేక, ఎండలకు తాళలేక వృద్ధురాలు మృతిచెందినట్లు తెలిపారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



పస్పులలో హరితహారం మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్

కోడేరు: మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పస్పులలో హరితహారం మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పండ్ల మొక్కలు, ఈత మొక్కలను పెంచాలన్నారు. ప్రతి రోజు మొక్కలకు నీరు పట్టాలని సూచించారు. అదే విధంగా బాడిగదిన్నెలో ఉపాధి హామీ పనుల వద్ద మేటి శ్రీనివాసులు, ఆశ కార్యకర్త కళావతి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

వెల్దండ: మండలంలోని పోతేపల్లితో పాటు ఆయా గ్రామాల్లో నర్సరీలను సోమవారం ఏపీఓ ఈశ్వర్‌జీ పరిశీలించారు. ప్రతి నర్సరీలల్లో ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. వర్ష కాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. అదే విధంగా ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనులను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

పంట నష్టం ఆందోళనలో రైతులు



పస్పులలో నేలరాలిన మామిడి కాయలు

తిమ్మాజిపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షంతో చేతికి వచ్చిన పంటలు నేల పాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రూ.లక్షలు అప్పులు చేసి పెట్టుబడులు పెడితే వర్షంతో పూర్తిగా నష్టపోయారు. సోమవారం అధికారుల పంటలను పరిశీలిస్తారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. మండలంలోని విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓలు పాలెంలో శిక్షణకు వెళ్లారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు శిక్షణకు వెళ్లడంపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాలిన మామిడి కాయలు

కోడేరు: మండల కేంద్రంతో పాటు పస్పుల, జనుంపల్లి, తీగలపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. వరిపంట, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి గాయత్రి

చారకొండ: పౌష్టికాహారంతో ఆరోగ్యం కలుగుతుందని ఆయుర్వేద వైద్యాధికారి గాయత్రి అన్నారు. తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయూష్ విభాగం ఆదేశానుసారం మండల కేంద్రంలో సోమవారం మండల ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారిణి గాయత్రి ఆరోగ్యంపై సలహాలు సూచనలు ఇచ్చారు. ఫార్మసిస్టులు బిచ్యా నాయక్, అంగన్‌వాడీ టీచర్ సుదేష్ణ, ఏఎన్ఎంలు అలివేల, సరిత ఆశాలు సత్యవతి, రాములమ్మ, సుమతమ్మ, సువర్ణ, తదితరులు ఉన్నారు.



అటెన్షన్ ప్లీజ్

దారిలో ధాన్యం.. జర భద్రం



ఐతోలు గ్రామం వద్ద రోడ్డుపైనే వరిధాన్యం

ప్రస్తుతం యాసంగి సాగు వరికోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కల్లాలు లేకపోవడంతో రహదారులపైనే వరిధాన్యం ఆరబోస్తున్నారు. మండలంలోని ఇంద్రకల్ నుంచి మొదలుకొని ఐతోలు, సిర్సవాడ, పాపగల్ మీదుగా జడ్చర్ల వరకు ఉన్న డబుల్ రోడ్డును సగానికి పైగా ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి గుంతకోడూరు, మేడిపూర్, సుద్దకల్ మీదుగా కల్వకుర్తి వెళ్లే రోడ్డు ధాన్యంతో నిండిపోతుంది. ప్రస్తుతం సుద్దకల్, గుంతకోడురు దగ్గర ఉన్న సర్వీస్ రోడ్డు మొత్తాన్ని ధాన్యంతో కప్పించారు. దీనికి తోడు ధాన్యానికి రక్షణగా రైతులు రోడ్డుపై పెద్ద పెద్ద బండరాళ్లు పెడుతున్నారు. రోడ్లపై ప్రయాణించే వాహనాదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మూలమలుపుల వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– తాడూరు